
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## నాగేశ్వరరావుతో సంభాషణ

## (కినీమా 1956 ఫిబ్రవరి, నుంచీ పునర్ముద్రణ)

**నాగేశ్వరరావు** ఎక్కువ చిత్రాలలో ఎందుకు నటించటంలేదు? దీనికి కారణం నాగేశ్వరరావా? నిర్మాతలా? అనే ప్రశ్నలు అసంఖ్యాకంగా 'కినీమా' పాఠకులనుంచి మాపై వర్షిస్తున్నవి. 1956లో తయారౌతున్న చిత్రాల సంఖ్య నాలుగుపదులు దాటటం, అందులో నాగేశ్వరరావు నటించే చిత్రాల సంఖ్య తక్కువగా ఉన్నదనీ, తమ అభిమాన నటుడు నాగేశ్వరరావును ఎక్కువ చిత్రాలలో చూడలేకపోతామేమోననే ఆందోళన ప్రేక్షకలోకం చెందటం ఈ మధ్య అధికమైంది. ఇందుకు కారణం ఎన్.టి.రామారావు నటించబోతున్న చిత్రాల సంఖ్యే ఎక్కువని స్పష్టంగా పాఠకులకు తెలుస్తుండడం కూడాను.



మాకుకూడా ఈ ధర్మసందేహం కలిగింది. స్వయంగా వెళ్ళి నాగేశ్వరరావు ముఖేనా ఆ సందేహం తీర్చుకుని పాఠకలోకానికి అందజేయాలనే ఆతురత చెందాము. వెంటనే వారింటికి వెళ్ళాము. "తెనాలిరామకృష్ణ షూటింగ్ ఉందండి. అక్కడికి వెళ్ళారు" అని నాగేశ్వరరావుగారి కార్యదర్శి చెప్పారు. తిన్నగా మా బండిని రేవతీ స్టూడియోకే నడిపించాం.

ఆ రోజు జనవరి నాలుగవ తేది. "తెనాలి రామకృష్ణ" చిత్రం షూటింగు ఆకరిరోజు. కెమెరా ముందు భానుమతి పాటపాడుతూ అతివయ్యారంగా నృత్యం చేస్తున్నది. నాగేశ్వరరావు, ఎన్.టి.రామారావు, సంధ్య, ముక్కామల అంతా సెట్‌పై ఉన్నారు.

షూటింగ్ పూర్తయేవరకూ ఉన్న పిదప నాగేశ్వరరావుకి మేము వచ్చిన సంగతి చెప్పి తొలి ప్రశ్న వేశాం.

"ఏం మహాశయా! 1956లో నలభై చిత్రాలు తయారౌతున్నాయి. అందులో మీరు నటించబోయే చిత్రాల సంఖ్య చాలా తక్కువ కనిపిస్తున్నై. ఎందుచేత?"

మా ప్రశ్న వినగానే బిగ్గరగాను, విచిత్రంగాను నవ్వి నాగేశ్వరరావు అన్నాడు: "సినిమా ప్రపంచంతో పరిచయం ఉండికూడా నా అభిమానులు అన్నట్టే మీరూ అంటున్నారేమిటి?"

"మా సందేహం నిజంకాదా?" అని ప్రశ్నించాం.

"కాదు. ఇప్పుడు నటిస్తున్న చిత్రాల సంఖ్య ఎక్కువగావుందని నేను బాధపడుతుంటే తక్కువని మీరంతా అంటారేమిటండి?" అన్నాడాయన.

"మీరెందుకు బాధపడుతున్నట్లు?"

"నా ఉద్దేశంలో నేను తినగలిగినదానికంటె ఒక ముద్ద ఎక్కువ తింటే విషంగా మారుతుంది."

"ఐతే మీరు  ఏ ఐదారు చిత్రాల్లోనో నటిస్తున్నట్లు మాకు గుర్తు.. అంతేనా?" అని అడిగాం.

"ఐదారేమిటండీ? ఇదిగో ఈ సంవత్సరంలో నేను ఒప్పుకున్న చిత్రాల జాబితా. 1 వరసూవారి ప్రొడక్షన్ న.3, 2 లలితా ఫిలింస్ వారి "చరణదాసి" (తెలుగు, తమిళం) 3 వరలక్ష్మి ఫిలింస్ వారి "సావిత్రి". 4 అంజలి పిక్చర్స్‌వారి ప్రొడక్షన్ నం. 3. 5 (తెలుగు, తమిళం) 9 అన్నపూర్ణావారి 'తోటికోడళ్ళు ' 10 "తెనాలి రామకృష్ణ" ఇదొక వారం రోజుల్లో విడుదలౌతుంది కదా! ఇందులో మరి రెండు చిత్రాలు త్వరలో విడుదల కాబోతున్నాయి. అంటే అవిగాక 8 పిక్చర్లున్నై. వాట్లలో డబుల్ వర్షన్ చిత్రాలు రెండు. ఏప్రిల్ నెలనుంచి పనిచేస్తానని ఇద్దరు ముగ్గురు స్నేహితులకు వాగ్దానం చేశాను. ఇవే ఎక్కువైనై. అంచేత వీట్లలో రెండుమూడు తగ్గిపోతే బాగుండునని నేను అనుకుంటూంటే నా చిత్రాల సంఖ్య తక్కువంటారేమిటి మీరు?" అని చాలా ఉద్వేగంతో చెప్పాడు.

ఆయన ప్రకటించిన ఆవేశానికి మాకూ ఏవో చీకటి తెరలు తొలిగినట్లవటమే కాకుండా మా ఎదుట ఒక కొత్త నాగేశ్వరరావు కనిపిస్తున్నట్లయింది.

"మీ పద్ధతులూ, మీ మాటలూ చూస్తే ఇదివరకటికీ, ఇప్పటికీ మీ మనస్తత్వంలోనూ, మీ జీవితదృక్పధంలోనూ చాలా వ్యత్యాసం కనబడుతోంది. "దేవదాసు" ఆదర్శావేశాలు మిమ్మల్ని ఆవహించలేదుగదా?" అని ఆతురతో అడిగాం.

"పాత్రలూ ఎప్పుడూ నా వ్యక్తిత్వం మీద ప్రభావం చూపుతాయని అనుకోను. అట్లాచేస్తే, నా పాత్రలన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటే చాలా పనులు చేయాల్సివస్తుంది. అందుకు ఉదాహరణ రొనాల్డ్ కాల్మన్ "డబుల్ లైఫ్". ఇంక నాలో మార్పు వచ్చిందంటారా? నిజమే. వచ్చిందని ఒప్పుకుంటాను. ఆ పరిణామం ఏమిటో రెండు మాటల్లో చెబుతాను. నేను చలన చిత్రపరిశ్రమకి వచ్చినప్పటికీ ఇప్పటికీ దాదాపు పుష్కరకాలం గడిచింది. ఇంచుమించు 50 చిత్రాల్లో నటించటం జరిగింది. వీటన్నిటికంటె ముఖ్యమైనది అభిమానులు 12 ఏళ్ళక్రితం వారి దృక్పథంలోవున్న నాగేశ్వరరావు వేరు. ఇప్పుడు వారి దృష్టిలోవున్న నాగేశ్వరరావు వేరు. ఆనాడు, నా అభిమానుల ఆదరం సంపాదించటం నా ఆదర్శం. ఈనాడు నన్నాదరించిన అభిమానుల్ని ఆనందపరచి, తద్వారా నాపై వారికి ఏర్పడిన సుహృద్భావాన్ని నిలబెట్టుకోవటం నా ఆదర్శం. ఈరోజున అదే నాజీవితంలో ఒక పెద్ద బాధ్యతై కూర్చున్నది. ఈ కారణంతోనే నాకు నేను నటిస్తున్న చిత్రాల సంఖ్య ఎక్కువౌతున్నాయని తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఇదే నాలో వచ్చిన పెద్ద మార్పు. మీకు గుర్తువున్నదో లేదో నేను నాలుగేళ్ళ క్రితం కొంతమంది జర్నలిస్టులు అడిగితే నటుడు ఏడాదికి ఐదు చిత్రాలలోకంటే ఎక్కువ చిత్రాల్లో నటించకూడదని నా అభిప్రాయాన్ని వెలిబుచ్చాను. ఆనాటి నా మాటలు నిలబెట్టుకోలేకపోయానని మీరు తిరిగి ప్రశ్నించవచ్చు. మీకా అవకాశంలేకుండా నేనే సమాధానం చెబుతాను. నన్ను మంచినటులలో ఒకణ్ణిగా చేసిన నాఅభిమానులకంటే ముందుగా నన్ను అభిమానించినవారు చిత్ర నిర్మాతలు. వారు మొదట్నుంచీ నన్నెంతో అభిమానించటం మూలంగానే ఇన్ని చిత్రాలలో నటించటం జరిగింది. వారితో బంధుత్వం కూడా ఏర్పడింది. ఆ బంధుత్వాన్ని తెంచుకోలేకనే నా అభిప్రాయానికి విరుద్ధంగా ఈరోజు నేను ఇన్ని చిత్రాల్లో నటించబోవటం జరుగుతోంది."

"ఐతే ఇప్పుడు మీరు నటిస్తున్న చిత్రాల నిర్మాతలు మాత్రమే మీకు దగ్గరవారా? మీరు నటించని, మిమ్మల్ని నటించమని అడగని నిర్మాతలు మీకు దగ్గరివారు కారా?" అని మేము ప్రశ్నించాము. ఆయన చిరునవ్వుతో యిలా సమాధానం చెప్పాడు.

"ఈ ప్రశ్న మీరు వేస్తారని నాకు తెలుసు. ఈ పరిశ్రమలో ఉన్న నిర్మాతలందరూ నన్నభిమానించినవారే. నాకు దగ్గరవారే. నిజం చెప్పాలంటే ఈ సంవత్సరం నేనిప్పుడు నటిస్తున్నవానికంటె రెట్టింపు అంటే దాదాపు 20 చిత్రాలను నేను ఒప్పుకోలేకపోయాను. అమే, ఆ నిర్మాతలందర్నీ, వారిపేర్లు నేను చెప్పకపోవటం మంచిది, నేను బ్రతిమాలుకునో, మరో విధంగానో, వారి చిత్రాల్లో నటించలేకపోయానన్నమాట."

ఇప్పటికి మా సందేహాలన్నీ తీరినవి. అంతేకాకుండా చక్కని నటుడు అనే కీర్తినీ, స్థాయినీ పెంచుకుంటూ పోతూండాలనే దీక్ష, కళాకారుని సంకల్పం నాగేశ్వరరావులో ఎంతటి తీవ్రరూపంలో ఉన్నదోకూడా మాకిప్పుడు అర్థమైంది. ఈ సమయంలోనే మాకుగల మరొక ధర్మసందేహం కూడా తీర్చుకోవాలని బుద్ధిపుట్టి ఇలా ప్రశ్నించాం.

"1956లో సుమారు నలభై చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. వాటన్నిటిలోనూ ఏ ఇద్దరు ముగ్గురు వ్యక్తులే ప్రధానపాత్రధారులుగా కనిపిస్తారేగాని కొత్త నటులు కనిపించరేం? దానికి కారణం ఏమిటంటారు?"

వెంటనే ఆయన ఇలా జవాబిచ్చాడు.

"ఈ ప్రశ్న నాకన్న చిత్రనిర్మాతలకు వేస్తే బాగుండేదేమో! దీని కీలకం అంతా నిర్మాతల చేతుల్లోనే ఉంది. ఏ నిర్మాతలైతే ఒకపుడు కొత్తవారమైన మా అందర్నీ ఇన్ని చిత్రాలలో నటింపజేసి పాత నటీనటుల క్రింద తయారు చేశారో, ఆ నిర్మాతలిదే ఈ బాధ్యత, కొత్తవారిని ప్రోత్సహించే బాధ్యత ఉంది. దాదాపు నాకుగల 12 ఏళ్ళ అనుభవంలో అనేకమంది నటీనటుల్ని చిత్రపరిశ్రమ ప్రోత్సహించింది. కొత్తవారిని ప్రోత్సహించడానికి నిర్మాతలకు అభ్యంతరం ఏమీ ఉండదనుకుంటాను. ఏమైనా ఈరోజున అనుభవం ఉన్న కొత్త నటీనటులు కావలసిన అవసరం ఎంతో ఉన్నదని మీలాగే నేను భావిస్తున్నాను."

Post your comments